

# భవానీద్వీపం

## -వనం వేంకట వరప్రసాదరావు



**నాలుగువందల సంవత్సరాల కాలపరిధిలో సామాజిక, చారిత్రక వాస్తవాలను, సాహిత్య, ఆధ్యాత్మిక, యోగశాస్త్ర, మంత్ర శాస్త్ర రహస్యాలను కలుపుతూ సాగిన గాథ. చరిత్ర నిర్ధారించిన సత్యాలు, చరిత్రకు అందని రహస్యాలు, చారిత్రక పురుషుల సాహసాలు, కలగలిపి సమన్వయము చేసిన గాథ. తెలియని కొన్ని వాస్తవాలను తెలియజేస్తూ, తెలుసును అనుకుంటున్న కొన్ని 'అపోహాలను' దూరం చేస్తూ సాగే కల్పిత సాహసిక గాథ. స్వతంత్ర సమరరంగముతో మొదలుకొని యుద్ధ, జానపద క్రీడల మర్మాలు, సాధకుల గాథలు, త్యాగధనుల చారిత్రక గాథలు కలిసిపోయిన కాల్పనిక గాథ. ఇలానే జరిగింది అని తెలిసిన సత్యాలకు యిలా కూడా జరిగి ఉండవచ్చు అన్న చారిత్రక పరిశీలనను జోడించి, వాస్తవ దూరం కాని ఊహలతో సాగిన పరిశీలనాత్మకమైన కథ. ఒక సాహసిక యోధుడి కథతో మొదలై క్రీ.శ. 1677 నుండి ఆధునిక కాలంవరకూ తరతరాల అంతరాలను, అంతరంగాలను విభిన్న కోణాలనుండి విమర్శించిన గాథ. కొందరికి తెలిసిన కొన్నిటిని, అందరికీ తెలియాల్సిన ఎన్నిటితోనో సమన్వయము చేస్తూ సాగిన వాస్తవ గాథల, చారిత్రక సత్యాల సమ్మేళనమైన కాల్పనిక గాథ!**

## - 51 -

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

'రంగని వారము మేము సిరులకు పొంగెడు వారము కాము
ఘన నర సింగని వారము మేము రాజీవ నయనా! రక్షింపవే మమ్ము రాక్షసకులాంతా..'

..అంటూ కృష్ణమాచార్యుల కంఠం అమృతాన్ని వరదలెత్తిస్తున్నది. కాకతీయ ప్రభువులు పంపిన రథం మీద వూరేగుతూ వస్తున్నాడు కృష్ణమాచార్యులు. మేలిమి అరబ్బుజాతి గుఱ్ఱాలు నాలుగు లాగుతున్నాయి ఆ రథాన్ని. ఒకరినొకరు తాకకుండా పాతికమంది కూర్చోడానికి సరిపోయే పెద్ద రథం అది. బంగారు రేకులు తాపడం చేసిన స్తంభాలతో, నగిషీలతో, శిఖరంతో కదిలివస్తున్న కాంచనపర్వతంలా వున్నది. పాతకమూరు సోదరులు ఎప్పటికన్నా అద్భుతంగా వేషాలు కట్టి కృష్ణమాచార్యుల గానానికి అనుగుణంగా దివ్యనర్తనం చేస్తున్నారు.

ఊరూరా, వాడవాడలా ఆగుతూ సాగుతున్నది రథం. సంతూరునుండి బయలుదేరి వారం రోజులు అవుతున్నది. ఊరూరా కృష్ణమాచార్యులు కూర్చున్న రథానికి, ఆ వెనుకే వస్తున్న మరొక నాలుగు రథాలకు మంగళ

హారతులు పట్టి, పొర్లుదండాలు పెట్టి తన్మయులవుతున్నారు ప్రజలు. వెనుక వున్న నాలుగు రథాలలో ఒక్కొక్కదాంట్లో ఒక పెద్ద భోషాణం వున్నది. విలువైన చందనపు కలపతో ప్రత్యేకంగా కాకతీయ ప్రభువులు చేయించిన మందసాలు అవి. కాకతీయ ప్రభువుల ఆస్థాన విశ్వకర్మలు ఆరు మాసాలు అహోరాత్రాలు శ్రమించి తీర్చి దిద్దిన మందసాలు అవి. ఒక్కొక్క దాంట్లో ముగ్గురు దృఢకాయులు హాయిగా పడుకోవచ్చు. అంత పెద్దవి! ఒక్కొక్క మందసానికి రక్షణగా యిద్దరు సైనికులు వున్నారు ప్రతి రథంలో. నిలువెత్తునా నల్లరాతితో చెక్కిన కాలభైరవుని ప్రతిమలలా వున్నారు.

ఆ నాలుగు మందసాలలో ఒక్కొక్క దానిలో లక్ష చొప్పున నాలుగు లక్షల రాగి రేకులు వున్నాయి. మూడున్నర దశాబ్దాల క్రితం సింహాచలంలో చిగురులు తొడగడం మొదలైన పాటల పారిజాతాలు నాలుగు లక్షలు ఆ రాగిరేకులమీద చెక్కించబడి వున్నాయి. పల్లవించిన పదసంకీర్తనాకుసుమాలు వాడకుండా భద్రంగా అలా రాగిరేకుల మీద చెక్కించి పరమాత్మునికి అప్పజెప్పడానికి బయలుదేరాడు కృష్ణమాచార్యులు. కాకతీయ ప్రభువులు వాటిని భద్రంగా చేర్చే బాధ్యతను తీసుకున్నారు. అంగరంగ వైభవంగా ఏర్పాట్లు చేసి, రథాలను, రక్షకభటులను నియోగించి ఆ సంకీర్తనా యజ్ఞంలో తామూ పాలు పంచుకుంటామన్నారు కాకతీయ ప్రభువులు. ఒక్క కోరిక మాత్రం కోరారు. ఆ నాలుగులక్షల దివ్య పారిజాతాల రథాలు ఓరుగల్లు మీదుగా వెళ్ళాలి అని మనవి చేశారు కృష్ణమాచార్య యతీంద్రులకు.

ఆ నాలుగు లక్షల సంకీర్తనా గ్రంథాలు, కృష్ణమాచార్యులు ఓరుగల్లు పట్టణాన్ని, కాకతీయ ప్రభువులను తమ దర్శనంతో ధన్యులను చేయాలి అని విజ్ఞాపన చేశారు. అలానే అని ప్రభువులను మన్నించి ఓరుగల్లు మీదుగా యాత్రను కొనసాగించడానికి నిశ్చయించారు కృష్ణమాచార్య యతీంద్రులు. కాకతీయ ప్రభువులను ఆశీర్వదించి, ఓరుగల్లు భద్రకాళిని, వేయి స్తంభాల గుడిలో రుద్రేశ్వరుడిని దర్శించుకోవాలి. స్తంభాద్రి నృసింహుడిని కొలిచి, ఇంద్రకీలాద్రి కనకదుర్గను సందర్శించుకోవాలి. మంగళాద్రి పానకాల రాయుడి పాదాలకు నమస్కరించి ఇక శ్రీరంగనాథుడి సన్నిధికి, కావేరీ తీరానికి చేరుకోవాలి. అది ఆ యాత్రా సూచి, కాకతీయ ప్రభువులు స్వయంగా నిర్దేశించినది! అదేవిధంగా అంకితయాత్ర ఆరంభించారు కృష్ణమాచార్య యతీంద్రులు.

రెండుప్రక్కలా నేల కనిపించకుండా బారులు తీరిన జనులు జయజయ ధ్వానాలు చేశారు. ఆకాశానికి చిల్లులు పడేట్లు చేసిన ఆ ధ్వనులకు యిహలోకంలోకి వచ్చాడు కృష్ణమాచార్యులు. చిరు చెమటలు అద్దుకుంటూ కూర్చున్నారు పాతకమూరు సోదరులు. మంగళహారతులు పట్టి రథం ముందు వంతులేసుకుని సాష్టాంగ దండప్రణామాలు చేశారు ప్రజలు. ఆ పల్లెను వదిలి ముందుకు కదిలాయి రథాలు. రథం కుదుపులు లయబద్ధంగా జోలపాడుతున్నట్లు అనిపిస్తున్నాయి. చెవులలో యింకా కృష్ణమాచార్యుల గొంతు తియ్యగా మారుమోగుతూనే వున్నది. కొద్దిసేపు కునికిపాట్లు పడి, అంతలోనే నిద్రలోకి జారుకున్నారు అన్నదమ్ములు.

మాసం క్రితం నుండి జరిగిన సంఘటనలు మగతలో కలలా కదలాడుతున్నాయి అన్నదమ్ములలో పెద్దవాడు యోగానంద నరసింహుడికి. నాలుగు లక్షల గ్రంథాల (సంకీర్తనల) రచన పూర్తి అయ్యింది, శ్రీరంగనాథుడికి అంకితం చేయడానికి బయలుదేరాలి అని కబురు వచ్చింది సంతూరునుండి. పట్టరాని ఆనందంతో సోదరులు బయలుదేరారు వున్నపళంగా. 'అదేమిటి స్వామీ! సింహాచలేశుడికి అంకితంగా కాదా గ్రంథాలు?' అని అడుగు పెడుతూనే అడిగాడు కృష్ణమాచార్యులను. చిరునవ్వుతో ముందు కాళ్ళు కడుక్కోమని సంజ్ఞ చేశాడు కృష్ణమాచార్యులు. తర్వాత సుఖంగా కూర్చోండి అని. తర్వాత దాహం తీర్చుకోండి అని. ఆ తర్వాత అన్నదమ్ములు స్థిమితపడిన తర్వాత చిరునవ్వుతో ప్రశ్నించాడు 'అహోబిలేశుడు, సింహాచలేశుడురంగనాథుడు.. ఎవరైతేనేం అంతా ఒకటే కాదూ?' మళ్ళీ తనే అందుకున్నాడు 'అహోబిలేశుడు, సింహాచలేశుడు కూడా శ్రీరంగానికే పదమన్నారు' అన్నాడు. ప్రశ్నార్థకంగా చూశారు అన్నదమ్ములు. తను కలగన్న సంగతి చెప్పాడు కృష్ణమాచార్యులు.

రెండు దివ్యమైన సింహాలు! కళ్ళు జిగేలుమనే గోధుమ వన్నె శరీరాలతో మెరిసిపోతున్నాయి. బంగారు రంగు కేసరాలు మెరుపులలా, బంగారు రంగు అలలలా ఎగురుతున్నాయి. నీలమో, మరకతమో, రెండూ కలిసినదో తెలియని రంగులో కనులు గగురుపొడిచేలా మెరిపిస్తూ తీక్షణంగా చూస్తున్నాయి. అంతలోనే బంగారు కొండలా అంతెత్తున మెరిసిపోతున్న పేటిక కనిపించింది. ఆ పేటికకు బంగారు పూవులు నగిషీ చెక్కి వున్నాయి. విలువైన మణులు తాపడం చేసి వున్నాయి. దాని నిండా రాగి రేకులు వున్నాయి. దాని మూతను బిగించి ఆప్యాయంగా పొదివి కౌగిలించుకున్నాడు తను. ఇంతలోనే ఆ పేటిక పెద్ద రథం మీద కనిపించింది. విచిత్రం! ఆ రెండు సింహాలూ గుఱ్ఱాలలా పగ్గాలతో ఆ రథాన్ని లాగుతూ దౌడు తీస్తూ కనిపించాయి! 'నరసింహా! నరసింహా!' అని ఆక్రోశిస్తూ తను ఆ రథం వెనుక పరుగులు పెడుతున్నాడు!

గర్జనలు చేస్తూ, జూలు విదిలిస్తూ గాలిలో ఎగురుతున్నట్లుగా ఆగకుండా పరుగులు పెడుతూనే వున్నాయి ఆ సింహాలు. కొండలూ, గుట్టలూ, అడవులూ, వాగులూ దాటి పోతున్నాయి. ఇంతలో ఆకాశాన్ని తాకుతున్నట్లు వున్న పెద్ద గోపురం కనిపించింది. ఏడు బంగారు శిఖరాలు వున్నాయి ఆ గోపురానికి. ఎంత ఎత్తు వున్నదో తెలియని మహా ద్వారం ఒకటి కనిపించింది అంతలోనే. వింజామరలు వీచినట్లు తెల్లని మేఘాలు ఎగురుతూ ఆ ద్వారాన్ని స్పృశిస్తున్నాయి. ఎక్కడినుండో ఏదో మధుర గంభీరమైన గొంతు వినిపిస్తున్నది '..కావేరీ విరజాసేయం వైకుంఠం రంగమందిరం..' ఆ రెండు దివ్య సింహాలు దూకుతున్నట్లుగా ఆ మహాద్వారం లోపలికి ఆ రథాన్ని లాగుతూ మాయమైనాయి. తను బిగ్గరగా నరసింహా! అని పిలుస్తున్నట్లుగా ఆ మహాద్వారం లోపలికి దూకాడు.

ఎదురుగా ఏదో దివ్యమైన మూర్తి పడుకున్న భంగిమలో వున్నది. నల్లగా నిలువునా మెరుస్తూ వున్నది! ఆ రెండు సింహాలూ రథంతో సహా ఆ మూర్తిలో దూకినట్లుగా, కరిగిపోయినట్లుగా మాయమైనాయి. తను ఆ ఆకారాన్ని సమీపించి విభ్రమతో చూస్తున్నాడు. కుడిచేయి తలక్రింద పెట్టుకుని నిదురిస్తున్నట్లు వున్న మహావిగ్రహం అది! శిరస్సు భాగము, పాదాలు పూర్తిగా చూడలేనంత పొడవునా వ్యాపించి వున్నది. ఆ విగ్రహం ప్రాణం పోసుకున్నట్లు కదిలి, కనులు తెరిచింది. ఆహా! ఏమి అందం ఆ కన్నులది! ఎంత సమ్మోహనకరమైనచూపు! అది సౌందర్యప్రవాహం! ఆ ప్రవాహంలో కొట్టుకుపోతానేమో అనే భయంతో అన్నట్లు ఒక బంగారు స్తంభాన్ని గట్టిగా పట్టుకున్నాడు తను. అలా మైమరచి చూస్తూ వున్నాడు. అంతే! మెలకువ వచ్చింది.

కనులు మూసుకుని మరలా ఆ కలను చూస్తున్నవాడిలా చెబుతున్నాడు కృష్ణమాచార్యులు. అందమైన అనుభవాన్నిమరలా అనుభవిస్తున్నట్లు మైమరచి చెబుతున్నాడు. ఆయన చెంపలమీదుగా మెరుస్తూ తడి కనిపిస్తున్నది. నోళ్ళు తెరుచుకుని గుడ్లప్పగించి వింటున్నారు ఆరుగురు అన్నదమ్ములు.

పాఠకుడా! ఆశలు, ఆలోచనలు, అనుభూతులు, కోరికలు పరస్పరం తాకి విరిగిపోయే అలలు. అంతరంగం మహా సాగరం. అంతరంగంలోని అలల అలజడి కలల వీచికలను రేపుతుంది. మనుగడ ఒక పెద్ద కలలో చిన్న కల లాంటిది. ఇవి ఆ కలలో యింకా చిన్న చిన్న కలలు! ఎన్ని కలలు, ఎన్ని కథలు, ఎన్ని వెతలు, ఎన్ని కల్లోలాలు చూశాను నేను! ప్రతి కథా మరొక కథతో ముడిపడి వున్నదే. ప్రతి కలా కరిగిపోయేదే! కొన్ని పీడకలలు, కొన్ని మధుర స్వప్నాలు, అంతే తేడా! అది గ్రహించినవాడు జ్ఞాని. ఆ జ్ఞానికి జనన మరణాలు ప్రపంచమనే పెద్ద కలలో చిన్న కలలు, క్షణికాలు. ఆ జ్ఞానావస్థ ఎన్నడో అనుభూతమైంది కృష్ణమాచార్యులకు.

కృష్ణమాచార్యుల సోదరుడు హీనమైన చావుకు గురియై రెండు దశాబ్దాలు దాటుతున్నది. తమ్ముడి భార్యను తన కన్నకూతురిలా చూసుకుంటూ వచ్చాడు. వివాహమైన పదిహేనేళ్లకు కృష్ణమాచార్యులకు కొడుకు పుట్టాడు. హమ్మయ్య అని నిట్టూర్చాడు. భార్యను, కొడుకును, మరదలిని ఒకరికొకరిని తోడుగా వుంచి తను అన్ని బంధాలు వదిలించుకుని సన్యాసం తీసుకోవచ్చు అని సంతోషపడ్డాడు. నెమ్మదిగా వాడికి ఉపనయనం

చేసి వంశపారంపర్యంగా వస్తున్న సంతూరు నరసింహుడి కొలువు అప్పగించి వెళ్లిపోదామనుకున్నాడు. కానీ పిల్లవాడి కర్మ ఫలం ఏమిటో తెలిసి లోలోపల వేదన చెందాడు. ఆయన అనుకున్నట్లే అయ్యింది!

ఒక అపరాహ్ణ వేళ కోవెలలో నివేదన చేస్తుండగా పరుగున వచ్చిన పనివాడు భోరున గుండెలు బాదుకుని ఏడుస్తూ, కృష్ణమాచార్యులను యింటికి తీసుకెళ్ళాడు. అరుగుల మీద కొడుకు శవాన్ని పెట్టుకుని గుండెలు అవిసిపోయేలా విలపిస్తున్నది ఆయన ఇల్లాలు. ఊరు ఊరంతా తిరునాళ్ళకు మూగినట్టు మూగి వున్నారు ఆవరణ నిండా. సలసల మరిగే గంజి గుంటలో పడి దారుణ మరణం పాలైనాడు కృష్ణమాచార్యుల కొడుకు. నిర్లిప్తంగా భార్యను అనునయించాడు కృష్ణమాచార్యులు. ప్రపంచం మీద ఆయన విరక్తి యింకా పెరిగింది. జన్మ జన్మల కర్మ ఫలితం ఆ కొడుకు, వాడి తల రాత అని తెలుసు ఆయనకు. ఆ బంధం, ఆ కర్మ పరిపాకం యింకా ముగిసిపోలేదు అని కూడా తెలుసు. నిర్వేదంగా మూడు రోజులపాటు సంతూరు నరసింహుడి పాదాల మీద తలవాల్చి ఆత్మ నివేదన చేసుకున్నాడు. ఏం సమాధానం దొరికిందో! తను పూర్తి చేస్తానన్న గ్రంథ రచనమీద మనసు పెట్టాడు పూర్తిగా.

కొడుకుమీది బెంగ మనోవ్యాధిగా మారి క్రుంగి కృశించి పోయింది కృష్ణమాచార్యుల ఇల్లాలు. కొడుకు చనిపోయిన రెండు సంవత్సరాలకు తనూ రాలిపోయింది. ఆ జీవికి విముక్తి దొరికిందనుకున్నాడు కృష్ణమాచార్యులు. మరదలు పుట్టింటికి వెళ్ళిపోయింది. ప్రత్యేకంగా సన్యాసం స్వీకరించని సన్యాసి అయినాడు కృష్ణమాచార్యులు. ఈ అయిదు సంవత్సరాలు నిరంతరం నృసింహ నామస్మరణయే ఊపిరిగా బ్రతికాడు. తలపెట్టిన నాలుగులక్షల గ్రంథ రచన పూర్తి అయ్యింది. రంగనాథుడు నువ్వు నా దగ్గరికే రమ్మన్నాడు. సరేనని బయలుదేరాడు కృష్ణమాచార్యులు!

ఏకశిలా నగరం పొలిమేరలలోకి వచ్చినట్లు గ్రహించాడు కృష్ణమాచార్యులు. ప్రభువుల ఆజ్ఞానుసారం నగర స్వాగత తోరణం వద్ద రథాలు ఆపుజేశారు ప్రభువుల సైనికులు. కాళ్ళు కడిగి, మంగళ హారతులు పట్టి, పూర్ణకుంభంతో స్వాగతం పలికారు కాకతీయ ప్రభువు. వంద ఏనుగులతో, రెండువందలమంది అశ్వికులతో, స్వయంగా తమ రథం మీద కృష్ణమాచార్యులను ఊరేగింపుగా నగరంలోకి వేంచేపు చేయించారు. ఓరుగల్లు వీధులలో, రెండు ప్రక్కలా జయజయ ధ్వానాలతో, నాలుగులక్షల సంకీర్తనల సరస్వతికి మంగళ వాయిద్యాలతో దివ్యమైన ఊరేగింపు జరిగింది. ప్రభువుల ఆదరణకు, నృసింహ సంకీర్తనల పట్ల భక్తికి పులకించిపోయాడు కృష్ణమాచార్యులు.

'భద్రంబులగు నీకు భక్తుల బంధుడా
భద్రాకాళికి మేటి పెద్దన్నా! నరసింహా! ..'

అని ఆనందబాష్పాలతో నిలువెల్లా తడిసిపోతూ ఎలుగెత్తి గానం చేశాడు కృష్ణమాచార్యులు. పాఠకుడా! నేనే యేనాడూ చూసి ఎరుగని అద్భుతం జరిగింది! నమ్మకపోతే నీ కర్మం, జరిగింది జరిగినట్లుగా చెప్పడం నా ధర్మం. ఓరుగల్లు వీధులలో ఆకాశం నుండి బంగారు నాణాల వర్షం కురిసింది. నేనే ప్రత్యక్ష సాక్షిని!

ప్రభువుల సత్కారాన్ని నరసింహుడికి చేస్తున్న సేవగా స్వీకరించాడు కృష్ణమాచార్యులు. భద్రకాళిని దర్శించుకున్నాడు. వేయిస్తంభాల గుడిలో నందికేశ్వరుడికి ఆహారాన్ని నివేదన చేశాడు. రుద్రేశ్వరుడికి అభిషేకం చేయించుకున్నాడు! ప్రభువులు నగరపొలిమేరల వరకూ వెన్నంటి వీడుకోలు పలికారు, అంజలి ఘటించి, అశ్రువులతో చెమ్మగిల్లిన కనులతో!

క్రమంగా కనుమరుగై తరలిపోయాడు కృష్ణమాచార్యులు. పాఠకుడా! కథలన్నీ కదిలి వెళ్ళిపోయేవే, కంచికి కొన్ని, కావేరీ ద్వీపానికి కొన్ని!

(కొనసాగింపు వచ్చే సంచికలో..)